ప్రయోజకుడు

"శ్రీరస్తు శుభమస్తు కళ్యాణమస్తు; సర్వ సద్గుణసహిత సౌభాగ్యమస్తు" అంటూ, ఉప్పొంగే ఆ ప్రేమని ఆశీర్వచన రూపేణా ఉచ్చారణ చేశారు సుబ్రహ్మణ్యంగారు పద్మావతి నమస్కారం స్వీకరిస్తూ.

"రాజంటి మొగుణ్ణి పెళ్ళాడి పండంటి పిల్లల్ని కని వర్ధిల్లు తల్లీ!" అన్నది కామేశ్వరమ్మగారు.

"పార్వతీ పరమేశ్వరులవంటి వృద్ధ దంపతులు-మీ నోటిమాట చలవని ఏదో...." అంటూ ఊహు(మురిసిపోయింది సూర్యకాంతమ్మ గారు అవిడ తమ్ముడు రాజువేపు చూస్తూ.

తాళ ప్రమాణాన లేచారు సుబ్రహ్మణ్యంగారు-- "చూశావే పిల్లా! నీతోపాటు నన్నూ ముసలాణ్ణిచేసి పారేసింది వదినగారు.... కిమ్మన వేం?....చెప్పు!" అంటూ భార్య కామేశ్వరమ్మగార్ని మోచేత్తో పొడిచారు.

కామేశ్వరమ్మగారు విసుక్కుంది, "బావుంది సరసం—మరీరోజు రోజుకి కుర్రచేష్టలు ఎక్కువయిపోతున్నాయి, ఇదెక్కడి అల్లరమ్మా! చిన్నాపెద్దా, సమయం సందర్భం లేకండా! ఏదో శాస్త్రం చెప్పినట్టుంది ....పెళ్ళీడు పిల్లముందర ఏమిటా మాటలు? మరీ ఇది కాపోతే...."

చిలిపిగా వెలిగాయి సుబ్రహ్మణ్యంగారి కళ్ళు. "చూశారూ వదినా ....మా కాముడుందే --స్వతహాగా చాలా మంచిదేసుమండీ—ఏదో అప్పుడప్పుడు కొంచెం తిక్క—అస్తమానూ నన్ను ఇలా రాసి రంపాన పెడుతుం దనుకునేరు! అన్నారు, సూర్యకాంతమ్మగారితో. ముసిముసి నవ్వులతో అటు తిరిగి తన భర్తవేపు చూసింది సూర్యకాంతమ్మగారు. ఈ గొడవలతో సంబంధం లేనివాడల్లే ఆయన సావకాశంగా చుట్ట కాల్చుకుంటూ, గబగబా పేపరు చదువుకుంటున్నాడు.

మళ్ళా ఇటు తిరిగింది.

"ఏదో బాబూ! మీ నోటి చలవన మా పద్మకి మా రాజిగాడు మూడు మూళ్ళు పడేస్తే....ఏమనుకున్నారో గానీ వాడికి పద్మం టే పంచప్రాణాలూను. ఇది చూస్తే సవాలక్ష గంధం చదువుతుంది వాడిమీద" అంది—దూరంగా బంగారుతండ్రల్లే బాచాల కొండల్లే కూర్చున్న రాజును చూస్తూ.

సుబ్రహ్మణ్యంగారి సతీమణి కామేశ్వరమ్మగారు అందుకుంది. "ఆఁ! మీకు పిచ్చికాని, దాని కిష్టమే ఉంటుంది.—బావనికాదని ఇంకెవడ్ని చేసుకుంటుందండీ — కాపోతే సిగ్గు — పిచ్చితల్లికి"

"ఆఁ!చాల్లెద్దూ! కబుర్లు కెక్కడికిలే—ఈ కాలం పిల్లలు మీ కన్నా నాలుగాకులు ఎక్కువ చదివారు. "ఫలానా మొగుడే" కావాలని ఢంకా మీద దెబ్బకొట్టి చెప్పగలరు తెలుసా! సిగ్గూ బొగ్గూ కుదరదు. నిన్ను నా కిచ్చి కట్టినట్టనుకున్నావా ఏం?" అంటూ పద్మవంక చూశారు సుబ్రమణ్యంగారు.

సరిగ్గా అదే సమయానికి పేపరు చదువుతున్న పెద్దమనిషి- పద్మ తండ్రి - మందహాసం చేశారు. తిరిగి చుట్ట నోట్లో పెట్టుకుని పేపరు తినటం మొదలెట్టాడు.

"పద్మ ప్రేమ ప్రేగిపోయింది" అనేవాళ్ళు:- ఆ క్షణాన పద్మ అన్న మాట ఎవరేనా పరాయివాళ్ళు వినివుంటే. నిజమే: పద్మ అన్నదిది-

"రాజుగాణ్ణీ, గీజుగాణ్ణీ నేను చచ్చినా పెళ్ళాడను. నేను అప్పారావుని పెళ్ళాడుతా. నాన్నగారు కూడా సరే అన్నారు" అని.

"అవ్వ హవ్వ!" అన్నది సూర్యకాంతమ్మగారు.

తుళ్ళిపడ్డాడు పద్మ తండ్రి.

కామేశ్వరమ్మగారు విస్తుపోయింది.

సుబ్రహ్మణ్యంగారు హాహాకారాలతో నవ్వటం ప్రారంభించారు.

ఆయన అంత హృదయపూర్వకంగా నవ్వి చాలా కాలం అయింది. ఆ నవ్వుకి పచ్చగా దోసకాయవలె, వెండిమీసాలతో నిండుగా వున్న ఆయన ముఖం ఎఱ్ఱగా అయిపోయింది. ఫాల భాగాన కణతలమీద రక్తనాళాలు ప్రస్ఫుటంగా కనబడ్డాయి. కంటనీరు తిరిగింది.

కామేశ్వరమ్మగారు కంగారు పడిపోయింది. బెంబేలెత్తిపోయింది. "ఏం ఓఘాయిత్యపు మనిషమ్మా!- ఏమొచ్చినా చిక్కే" అంటూ సుబ్రహ్మణ్యంగారికి గాలి విసరటం ప్రారంభించింది.

నవ్వునించి సుబ్రహ్మణ్యంగారు త్వరగానే తేరుకున్నారు. అందరి మనస్సులూ తేలికపడ్డాయి.

"కంగారు పడ్డావుటే కాముడూ!" అన్నారు సుబ్రహ్మణ్యంగారు, "చూడండి వదినా—మా కాముడికి నేనంటే యెంత ప్రాణమో! సీతా సావిత్రీ - సువర్చలా - సుబ్బారావుగారి ఎంకీ, మా కాముడు ముందు తీసికట్టే-"

ఈ కొత్త ధోరణి ఎన్నడూ కనీ వినీ ఎరుగని కాంతమ్మగారు కొద్ది కంగారుపడింది.

పండు తమలపాకువంటి కామేశ్వరమ్మగారి శరీరం ఆపాద మస్తకం జలదరించింది. సంధ్యా సమయాన, ఎర్రని కాంతులతో వెలిగే ఆకాశఫలకాన సూర్యబింబంవలె, సిగ్గుతో కందిపోయి ఎర్రబారిన ఆమె విశాలమైన నుదురుపైన వెండి రూపాయంతటి కుంకుమ తిలకం ప్రకాశించింది. పండబారిన అమె శిరోజాలు ఆ అరుణరాగంలో పాలి పోయాయి. పాతిక సంవత్సరాలక్రితం తొలిసారి సిగ్గుతో వాలిన ఆమె సుందర, సువిశాల నేత్రాలు, ఆనాడు ఆమెలో తను చూచిన దేవతల అందం తిరిగి, ఈ క్షణాన, ఒకే ఒక ముహూర్తకాలంపాటు సుబ్రహ్మణ్యంగారికి గోచరించాయి.

క్షణకాలం ముగ్ధుడై పోయాడాయన- తనభార్య సౌందర్యం చూసి,

"చాల్లెండి - ఎవరన్నా నవ్వి పోయేరు" అన్నది కామేశ్వరమ్మ గారు - చెంపకు చారెడున్న కళ్ళని సొగసుగా వాల్చుకుంటూ.

పక పక నవ్వారు సుబ్రహ్మణ్యంగారు - నోరు తెరుచుకుని ఆశ్చర్యంగా తనవంక చూస్తున్న పద్మవంక చూస్తూ.

"ఏం పద్మ తల్లీ - రేపు నీ మొగుణ్ణి ఇలాగే గసిరిపారేస్తావే నువ్వూనూ?"

పెంకె ఘటం పద్మ.

"లేదు తాతా.... మంచి మొగుడు దొరుకుతే గసరనులే. రాజుబావ లాటివాడు దాపరించాడా - గసరడం కాదు గదా, తంతానుకూడా" అంది.

"సిసలయిన ఆడదానివే నువ్వూ ....నీ మాట నెగ్గించుకోవాలి గాని...."అన్నారు సుబ్రహ్మణ్యంగారు.

పద్మతల్లి కొంచెం చిరాకు పడింది ఈ ధోరణి చూసి. ఇక లాభం లేదు. "ఏమే పిల్లా! ఓ నీళ్ళు పోసుకేదుద్దాం-ఓ జడ ఏడుద్దాం....లేకపోతే

కాఫీ చెంబులు తొల్చి లోపల పడేద్దాం అనీ లేదుగదా .... ఊహు పెద్దా పేరక్కలాగ తయారూ! తగుదునమ్మా అంటూ- చిన్నా పెద్దా లేకుండా- ఊః కదలవేం?"

పద్మ కదిలే సూచనలేం కనపడలేదు. వాళ్ళ నాన్న కేవలం ధూమానంద స్వామివలె చుట్ట కాలుస్తూ, తనలో తనే నవ్వుకుంటున్నాడు.

సుబ్రహ్మణ్యంగారు చిన్న చిన్న కలహాలు పుట్టించడంలో అందె వేసిన చెయ్యి. సమయం చూసి చిట్కా వేశారు చమత్కారంగా. "ఏవమ్మోయ్ వదినా! కుర్రకుంక- దాన్నంటావేం! అదుగో వెనుక నుంచి భాగవతం ఆడించేది మీ ఆయన. అతగాణ్ణి అడుగు నిలేసి .... ఏమయ్యా ధూమానంద స్వామీ!....ఏం కథ?...."

"అలా గట్టిగా అడగండి బాబూ....అలా అడగండి...."

ధూమానందస్వామి చిరునవ్వు ప్రచురించాడు.

ఛర్రునలేచి వంటింట్లోకి పోయింది సూర్యకాంతమ్మగారు బాష్పవేదం పఠిస్తూ.

పద్మ కిల కిల నవ్వింది.

సుబ్రహ్మణ్యంగారికి గుర్తుకొచ్చింది.

"ఔనే కాముడూ....మన సుబ్బులు పోలిక లేదే పద్మకి? ....లేకపోవడమేమిటి! అంతా అదేనాయె! కనుముక్కు తీరూ కట్టుబొట్టూ మాట తీరూ—ఎటొచ్చీ పేరు తేడా అంతే....!"

కథకి ఉపక్రమించే సూచనలు కనబడ్డాయి సుబ్రహ్మణ్యంగారిలో కామేశ్వరమ్మగారికి.

"పనీపాటూ లేదా ఏమిటి మీకు—రైలు దిగి కథ మొదలెట్టారపుడే కబుర్లు. కట్టి పెట్టి స్నానానికి లేవండి." కొంటెగా భార్య వేపు చూసి

కన్ను మీటి ఏం జరగనట్టే రామదాసు వైపు తిరిగారు. "ఏమోయ్ ! ఓ రామదాసు పంతులూ ! ఓ! ధూమానంద స్వాములూ! ఇంకో చుట్ట పట్టుకు నిక్కడకు రావయ్యా—కథ చెప్తానూ. మాసుబ్బలక్ష్మి అచ్చం నీకూతురులాగే వుంటుంది. చిత్రంగా అయిందిలే దాని పెళ్ళి."

రామదాసుగారు దగ్గిరకు జరిగారు ఉషారుగా. పద్మ బాషెంపెట్టి వేసుకూర్చుంది శ్రద్ధగా.

'నేను లోపల కెడతా—మీరు కథలు చెబుతారో కచేరీలు చేస్తారో కానీయండి బాబూ" అని సాగదీసుకుంటూ లోపలకి సాగిపోయింది కామేశ్వరమ్మ గారు.

మంచినీళ్ళబిందె భుజాన పెట్టుకుని లోపలకొస్తున్న రామదాసుగారి తల్లి, కథ అన్నమాట వినబడగానే నిలబడిపోయింది.

'ఎప్పుడు రాక బాబూ! అంతా కులాసేనా? ఉత్తరం రాశారుగాదు.... అవునుగానీ పట్టపగలు కథ చెప్పుకుంటే పట్టపు రాజు చచ్చిపోతాడు. ఒక్క క్షణం ఉండు బాబూ" అంటూనే బిందె దింపి పట్టపు రాజుని భద్రంగా కొంగులో ముడేసుకుని బిందె పట్టుకు చక్కా పోయిందావిడ. "ఓ సూరీడూ ఏం చేస్తున్నావే" అంటూ.

ముసి ముసి నవ్వుల్తో చుట్ట అంటించి పడకుర్చీలో సాగిల పడ్డారు సుబ్రహ్మణ్యంగారు. ఇటు రామదాసుగారూ, అటు పద్మ కూర్చున్నారు శ్రోతలుగా.

"అస లతగాడు రావడమే ఒక పెద్ద గాలీ వాన తంతుగా వచ్చాడు పూళ్ళోకి" అంటూ కథ మొదలుపెట్టారు అర్ధ నిమీలిత నేత్రులై పొగను చూస్తూ.

"వా డెవడూ? ఎక్కడకొచ్చాడూ? ఎందుకొచ్చాడూ? సరిగ్గా చెప్ప వయ్యా" అన్నారు రామదాసుగారు.

"అదే. ఏముందీ. నీ కూతురి పెళ్ళిసంగతి కదయ్యా మనం ఇప్పుడు గొడవ పడుతున్నదీ; నీ పెళ్ళాం-రాజు కిస్తానంటుందీ. నీ కూతురు పెంబు అరు అప్పారావంటుంది. నువ్వు మౌనేన కలహం నాస్తి అంటావు-ప్రయోజకుడని నువ్వనుకున్నవాడు దొరికేవరకూ.ఇంతకీ అంత ప్రయోజకు డైన వాడొస్తే నువిచ్చేదేవిటయ్యా? వాడే ఎగరేసుకు పోతాడు. నీ కూతురు వెంటపడుతుంది. అంచేత నేననే దేమిటంటే ఆ రాజూ కాదు ఈ అప్పా రావూకాదు. బ్రహ్మ నిర్దేసించిన ఇంకో శోభనాద్రి ఊడిపడతాడు; దేగలా ఎగరేసుకు పోతాడు నీ కూతుర్ని".

"ఆ శోభనాద్రి బావుంటాడా?" అంది పద్మ.

"దేవుడు కలగచేసుకుంటే నీ ఆట లేమీ సాగవులే" అన్నారు సుబ్రహ్మణ్యంగారు.

"ఆవచ్చినవాడు బావుండకపోతే తన్ని తగలేస్తా వాణ్ణి" అంది పద్మ.

"అదుగో, అదుగో! సరిగ్గా సుబ్బలక్ష్మి అంతే. సుబ్బలక్ష్మి తెలీదయ్యా; జగన్నాథం కూతురూ? ఇలాగే వాగేది కుండ పగలకొట్టినట్టు చితకలాటి మొగుడు దొరికాడు దానికి. బతక నేర్చినవాడులే! బహూ లౌక్యుడు .... అదే. ఆ కుర్రాడున్నాడే, వాడు రావడం రావడం గాలివాన తంతుగా వచ్చాడూళ్ళోకి. నేను పొలం పన్లమీద అప్పటికి వారం రోజుల క్రితమే ఆ వూరెళ్ళాను. రెండు నెల్లు బిచాణా వేశా నులే.

మరి కథ విను చెప్తా....

(సుబ్రహ్మణ్యేన ఉవాచః ఇదికథా ప్రారంభః)

"ఆ ఊళ్ళో - ప్రతి తెలుగు వూళ్ళోలాగే — మేడమీద తల ఉన్న ప్రతి ఆసామికీ, వాడికి ఉండుకునే ఆయొక్క భార్యకీ,కొడుక్కీ,

కూతురికీ, ప్రతి రెండో మనిషి జీవిత చరిత్రా కంఠతా పట్టి వల్లె వేస్తుంటేనేగానీ తోచదు. అందరూ కవులే! పోతన్న గారిని తల దన్నిన ఆసామిలే కవిత్వంలో. తెలిసిన కబురికి నగిషీలు చెక్కి రంగులువేసి మరీ ఇస్తారు పక్కవాడికి. నేను రెండు నెలలు పూర్తిగా బిచాణా వేశా నక్కడ.... అదే—నేను దిగిన వారంరోజుల్లో కామోసూ—రంగధాము దొకడు ఊళ్ళో దిగాడని వదంతులు లేచాయి.

"అతిథి మర్యాదలు చేసేనిమిత్తం బయలుదేరాం ఒకతండా. బెహరా హోటేలు పక్కన ఇంట్లో దిగాడన్నారు వార్తాహరులు. పోయి చూదుంకదా, కృష్ణమూర్తిగారి కొడుకు సుందర్రావు. పదేళ్ళ క్రిందటే కృష్ణమూర్తి పోయాడు. అతగాడు ఆస్తికన్న అప్పులు మిగిల్చి వెళ్ళాడు. అప్పటికి పన్నెండేళ్ళుంటాయి సుందర్రావుకి. పట్నంపోయాడు మేన మామతో....

"నోరు మంచిదైతే వూరు మంచిదన్నారు- వాళ్ళనీ వీళ్ళనీ మంచి చేసుకుని చదువూ సంధ్యా నేర్చుకుని నాలుగురాళ్ళు తేవడం మొదలు పెట్టాడు పద్దెనిమిదో ఏటికే."

"ప్రయోజకుడైనాడందూ....స్వయం శక్తితో" అన్నారు రామ దాసు పంతులుగారు శ్రద్ధగా.

"నాలుగు రాళ్ళంటే ఎన్ని రూపాయలు తాతా....మరి ఇంటికి చాలేవీ?" అంది పద్మ కళ్ళు పెద్దవిచేసి.

సుబ్రహ్మణ్యంగారు సాగిపోయారు.

"ఇల్లేముందీ ఒంటిపక్షి అయిపోయాడుగా.... ఇదుగో ఎంత ప్రయోజకుడైనాడయ్యా అంటే, రెండేళ్ళ కిందట తిరిగి స్వగ్రామం వచ్చి అప్పులాళ్ళగరేసుకుపోయిన భూములు తిరిగి కొన్నాడయ్యా.... ఆఁ! ప్రయోజకత్వం అంటే అదీ!....సరే.... మేమంతా వెళ్ళాంగా—

పలకరించాం—మళ్ళా ఆ భూముల్ని కౌలుకిచ్చి ఓ నెల ఇక్కడ కాల క్షేపం చేసి పోదామని ఒచ్చాట్ట-పట్నం విసుగేసి. "ఆవకాయ,మాగాయ, మామిడిపండు తినాలని మనసు పోయిందండీ. పోతే—నా అన్నవాళ్ళ మీ వంటివారి మధ్య నాలుగు రోజులు గడిపి పోవాలనుంది అవటా అన్నాడు. కుర్రాడు చూస్తే దీపంలా వున్నాడు. ఆ యొక్క వినయం, ఆ వందనం, ఆ మాట ఒద్దిక— ఓహో! ఎన్నికైన కుర్రాడయ్యా"

"ఏం చదివాడేం" అన్నాడు రామదాసుగారు.

"ఎలా వుంటాడేం" అంది పద్మ.

"చామనచాయ. కాస్త పొడుగనే చెప్పాలి. బక్క పలచగా వుంటాడు. అందాలరాసి అనసుగానీ మొగతనంలో వుండే ఆకర్షణ వుంది ఆ కుర్రాడిలో....కళ్ళున్నాయే కళ్ళు, కళ్ళజోడు వెనుక నుంచి చూస్తే ఆ కళ్ళలో ఆర్ద్రత గోచరిస్తుంది. కొద్దిగా, విశాలమైన నుదురు. నూగు మీసం. సరే పట్టవాసపు క్రాపు జుత్తు, కళ్ళజోడూ, రిస్టువాచీ, కమామీషూ ఉన్నాయనుకో.........ఆడదాని కేడువారాల నగలన్నారు....ఇతగాడు ఏడు వారాలకీ ఏడుశెళ్ళ పధ్నాలుగు జతలచొప్పున మారుస్తాడు. ఓ! పరిమళాలు గుబాళించిపోతాయి. జోళ్ళే ఓచిన్న దుకాణం ఏర్పాటు ఉన్నాయి. భ్రటా జనుకునేవు సుమా నన్ను !.... రామదాసూ— ఒక్కటి చెపుతా విను.... నీవంటి సంసారి ఆ సమయంలో అతగాడిని చూశాడా-దుబారా దివాణంలా వుందా వ్యవహారం.... అనేవాడు."

"పోన్లే ఇప్పుడు వింటున్నానుగా, ఇప్పుడంటా—శుద్ధ దుబారా వ్యవహారమే...."అన్నారు రామదాసుగారు చుట్ట ఆర్పేస్తూ.

"నువ్వు అనే దేమిటోయ్! అనాల్సిన వాళ్ళంతా అదివరకే అనే శారు. ఆ కుర్రాణ్ణి స్నానానికి వదిలేసి మేం బయటికొచ్చేసరికి గొల్లు మన్నారు—మా తండావాళ్ళు ఏకగ్రీవంగా."

"జోరుగా వుందే వ్యవహారం కుర్రాడిది" అన్నాడు అవధాన్లు కళ్ళుమీటుతూ.

"జోరా జోరున్నరా! కాకపోయినా అదేమిటోయ్ మరీ ఇదిగా పోతే — ఆ ట్రంకు చూశావూ — ఓ పాతిక జతలుండవూ గుడ్డలూ?" అన్నాడు జోగినాథం.

"జోళ్ళోయ్! జోళ్ళు! జోళ్ళమాట మర్చిపోయారు! రామరామ! అదొక బూటా — అదొక కాళోలీ జోడా-అదొక స్లిప్పర్సా — అదొక స్లిప్పరా — "అంటూ దండకం ప్రారంభించాడు — జోళ్ళ వివరాలు తెలుసుకున్న కోదండరావు.

"అవన్నీ సరేకాని — నాకు చిత్తొత్తిం దెక్కడయ్యా అంటే--వంట వాణ్ణి తెచ్చాడయ్యా, వంటవాణ్ణి! ఇదేమైనా సంసారి లక్షణమేనా అని?.... వాళ్ళ నాన్న బతికున్నప్పుడు ఎంత పొదుపు! ఎంత పొదుపు!.... గుట్టుగా వెళ్ళబుచ్చాడు కాలం." అన్నారు జగన్నాధంగారు;

"రామదాసూ! ఇదీ ధోరణి! నాకు జాలేసింది సుమా. రాకరాక కుర్ర వాడు సొంత ఇంటికొస్తే....పరోక్షాన్నే అనుకో.... ఇలా దుయ్యబట్టం నచ్చలేదు నాకు.

"ఏమయ్యా వాడికి వంటరాబోతే నువ్వు వండి పెడతావా?" అన్నాను నేను.

"మహారాజులా! సోలెడు బియ్యం పడేసే నాధుడే లేడా ఇక్కడ!" అన్నాడు జోగినాధం.

అవధాని తగులుకున్నాడు. "చాల్లేవయ్యా—దక్షతకి నిన్నే చెప్పు కోవాలి ముందర. కబుర్లకేం తియ్యగా చెప్పొచ్చావ్—!"అంటూ.

జోగినాధం మండిపడ్డాడు. "పోవయ్యా! నువ్వోనాడు సవ్యంగా మాట్లాడేవూ" "పోన్లే.... నేను మాటేనా అన్నాను.... నువ్వదీ లేదుగా.

ఇంతకీ ఎవ డేడ్చినా కుర్రవాడు, డబ్బు దుబారా చేసుకుంటే చిప్ప చేతి కొస్తుందనీ, వీడు మన కిష్టమూర్తి కుర్రాడనే నా ఇది."

"అందరి ఇదీ అంతేనయ్యా! ముందు ముందు పెళ్ళి గట్రా చేసుకుంటే, కొంపాగోడూ కట్టుకేడిస్తే ఈ ఎత్తున తూగగలడా అని" అన్నాడు జగన్నాధంగారు.

"ఏవయ్యోయ్! జగన్నాధం! పిల్లనిగానీ ఇవ్వాలనుకుంటున్నావేమిటి ఈ కుర్రాడికి?—ఎర్రగా బుర్రగా ఉన్నాడని మురిసి బోర్లాపడేవు" అన్నాడు జోగినాధం.

"అబ్బే? జగన్నాధం కూతురు—సుబ్బులయ్యా అది! అది మొగుణ్ణమ్మేస్తుంది తెలుసా!" అన్నా డవధాన్లు.

కామేశ్వరమ్మగారు లోపల్నించి ధనియాల కాఫీ తెచ్చింది. సుబ్రహ్మణ్యంగారు కథ ఆపారు.

"సుబ్బులు పెళ్ళిసంగతా?" అందావిడ.

"చిత్తం.... ఏం శలవండి...."అన్నారు సుబ్రహ్మణ్యంగారు.

"బావుంది! నోరెత్తడం భయంగా ఉంది బాబూ ఈ మనిషి దగ్గర. ఆ కాఫీ తాగి గ్లాసిలా పారేయండి. తొరగా తెమిల్తే నీళ్ళు తొలుపుతాను" అన్నదావిడ.

గ్లాసిచ్చి కథ సాగించారు సుబ్రహ్మణ్యంగారు;

"వింటున్నావే పద్మా!........ఆ సుబ్బులుందే—అది నీలాటిదే". శుద్ధమొండి ఘటం. లాకాయి లూకాయిమనిషి దానికి పనికిరాడు.... ఉభయ గోదావరి జిల్లాలలోని మన్మధు లందరిలో ఒక్కడు కూడా నచ్చలేదు తెలుసా దానికి? ప్రతివాడికీ ఒంకపెట్టేది— అంత ఆడది అది....సరే

నయ్యా రామదాసూ! ఏవిటి చెప్తున్నానూ——ఆ——అదే మా గుంపు నలుగురూ ఆ సుందర్రావుని పట్టుకు ఏకిపారేశారు. సరే మెల్లిగా అందరం బెహరా హోటలుకి చేరాం....బెహరా హోటలు ఇడ్లెన్లకి ప్రసిద్ధి. పెసరట్టుకు పెట్టిందిపేరు——కాఫీ నాటు రకం అనుకో. వరండాలోకి చేరాం అయిదుగురం——ఒక్కడికీ పనీ పాటూ లేదాయె తిని తిరగటం మినహా. ఉద్యోగం పురుషలక్షణం అన్నారు, గాబట్టి చదరంగం ఆడతారు వాళ్ళు. నాకు రాదనుకో. చూడ్డం బాగావచ్చు. సరే ఇద్దరు చదరంగానికి కూరుచున్నారు. మిగతా ఇద్దరూ సుందరావు ఆస్తి, ఆదాయవ్యయాల అంచనాలు వెయ్యటం ప్రారంభించారు. నేను ఇడ్డెనుల ఆరగింపు మొదలెట్టాను. ఐదో ఇడ్డెను మొదలెట్టబోతున్నాను. అయ్యరు ఊళ్ళో గోల ఏకరువు పెడుతున్నాడు.

తెల్లని సిలుకు చొక్కా వేసుకొని, గ్లాస్కోపంచ గూడకట్టు కట్టుకుని, చక్కగా తల దువ్వుకుని, సిగరెట్టుపెట్టి, అగ్గిపెట్టి పట్టుకుని వచ్చాడు సుందర్రావు. స్నానం గీనం చేశాడేమో-నవనవలాడిపోతున్నాడు జేగురుపాడు వంకాయలాగా. హోటలుకి పాలేరు కుర్రాడు దారిచూపించాడు కాబోలు; వాడికి వో అణాకాసు ఇచ్చాడయ్యా. అంతే ఇటు తిరిగి చిరునవ్వుతో పాకలోకి రాబోయినవాడల్లా——కొయ్యబారిపోయాడు. కారణం ఏమిటని అడగవేం?....వినూ....బురదరోడ్డుమీద పరుగెత్తే పాత లారీకి సడన్‌బ్రేకు వేసినప్పుడు సంభవించే శబ్దంతో సరితూగ్గలిగినంత గట్టిగా కేరుతూ ఆశ్చర్యం ప్రకటించారు....ఆవధానులూ, జోగినాధమూ జమిలిగా. ఆ యొక్క శబ్దం విని జగన్నాధం, ఆయొక్క దృశ్యం చూసి సుందర్రావూ-అతన్ని చూసి నేనూ వరుసక్రమంలో ఆశ్చర్యపోయాం. అరనిమిషం తరవాత జోగినాధం బొంయ్యిమన్నాడు; "ఆ పాలేరు వెధవకి నువ్వు అణా ఎందుకిచ్చినట్టయ్యా పంతులూ...." అన్నాడు కనిష్టేపు గొంతుకతో. సుందరం గ్రహించాడు కథ. నవ్వాడు.

"ఆఁ, పనిమల్లే నా కూడా వచ్చి దారిచూపించాడని. ఏం తప్పా?" అన్నాడు అమాయకంగా. పాక అదిరేటట్టు నవ్వారు అందరూ. జోగినాథం జోరు హెచ్చింది.

"పాలేరాళ్ళందరికీ ఇలా అణాలు పారేస్తూ - "తప్పా" అని అడుగుతావూ? - తప్పూ ఒప్పూ ఎవడిగ్గావాలయ్యా! రేపు చేతికొచ్చేది-"

"చప్ నోరు ముయ్యి" అంటూ జగన్నాథంగారు చేతిలో ఉన్న శగటుని జోగినాథం నోట్లో పెట్టేశారు.... సుందరం మనస్సు చివుక్కుమంది అనుకున్నాను, చిన్నబోయిన అతని మొహం చూసి.

"రావోయ్! రా! ఇదంతా మామూలే....పరవాలేదు రా" అన్నాను. నేను మహా పాతకాపయినట్టు. జోళ్ళు గుమ్మంలోవదిలి లోపలికి వచ్చి కూర్చున్నాడు సుందరం. మా వాళ్ళకి రెండు కళ్ళు చాలటంలేదు అతన్ని చూడ్డానికి. అంచేత వాళ్ళది వీళ్ళూ, వీళ్ళది వాళ్ళూ ఎరువుచ్చుకుని మరీ చూసేస్తున్నారు చొంగలు కారుస్తూ.

అయ్యరు ఇడ్లీ తెచ్చి పెట్టాడు సుందరం ముందు. "వారికి కూడా తెండి" అన్నాడు సుందరం: ఇడ్లీలు ముట్టుకోకుండా—మా చతుష్టయంలో చలనం కలిగింది. చిరునవ్వులు కూడా ఒలికాయి.

"అబ్బే ఎందుకు సుందరం బాబూ! డబ్బు దండుగా" అన్నాడు జోగినాథం.

"వృధా వ్యయం కాదండోయ్!"

"మేం పుచ్చుకున్నాం"

"అదీకాక మేం ఎలాగా భోంచేస్తాంగా"

"మేం భోంచేస్తామండి - ఎలాగా" అన్నాడు సుందరం మహా వినయంగా. ఆ తరువాత అందరూ కలిసి బ్రహ్మాండంగా నవ్వేరు....నవ్వు

పూర్తి అయేసరికీ అయ్యరు ఇడ్లీలు వడ్డించడం, అందరూ ప్రోక్షించి మొదటిముక్క నమలడం జరిగిపోయింది..

"పెసరట్టు కాల్చనా బాబూ!" అన్నాడు అయ్యరు బేరం తగిలిన ఉషారుతో.

"నాకు ఉల్లిపాయ వద్దు. కాని అల్లం, పచ్చిమిరపా బాగా దట్టించండి" అన్నాడు అవధాని తక్షణం.

"నాకు మిరప వద్దయ్యోయ్? కారం పడదు. ఉల్లిపాయ బాగా తగిలించు"

"చూడయ్యరూ! నాకు పెసరట్టొద్దు గానీ, మళ్ళా ఇడ్లీయే పట్రా దాని బదులు...."

"అయ్యా! రామదాసు పంతులుగారూ!.... ఇత్యాదయః" అంటూ పక పక నవ్వడం ప్రారంభించారు సుబ్రహ్మణ్యంగారు.

పద్మ మాత్రం తపీమని నిర్మొహమాటంగా ప్రశ్న వేసింది. "మరీ మీరు నవ్వేస్తున్నారు గాదా - ఆ సుందరం అనేవాడు రావడానికి ముందు మీ రిడ్లీలు తినేస్తూ వాళ్ళకిప్పించలేదేం?" అంది.

రామదాసుగారు కళ్ళెర్రచేసి చూశారు పద్మవైపు. సుబ్రహ్మణ్యంగారు నవ్వుతూ జవాబిచ్చారు. "బాగా అడిగావమ్మా. చెబుతావిను, నేనావూరొచ్చిన రోజునే అయ్యరు దగ్గర ఖాతాపెట్టడం-వీళ్ళని మేపడం జరిగింది. ఆ తరువాత మాటల్లో చెప్పేశాను; "మొహమాటం కిమన్నాస్తిః సుబ్రమణ్యేన సన్నిధౌ" ఆంటా అని "ఏమయ్యోయ్! నేను వూరికే బతిమాలలేనూ, మీకు కావల్సిందల్లా నిస్సందేహంగా పుచ్చుకోండి" అన్నాను. నాల్రోజులు కామోసు మామూలుగానే పుచ్చుకున్నారు.

"ఏమిటో! మీచేత ఇలా బోలెడు వ్యయం పెట్టించడం మాకేం బావులేదు" అన్నా రొకరోజుని ప్రేవున తేనుస్తూ.

"దాని కేముందయ్యా! నాకు లేని రోజున మీరు పెడుదురుగాని. అంటే ఇపుడు మీకు లేదనికాదు.... పోనీ మీ కంత "మరీ" యిదిగా వుంటే రేపొ్ద్దుటినించీ మీరునాకుపెట్టండి! మనలో మనకేమిటయ్యా! అన్నదమ్ము లంటివాళ్ళం—" అన్నాను. మర్నాడు వాళ్ళు రాలేదు. తరవాత వచ్చినా పుచ్చుకోడం మానేశారు. రేపొ్ద్దున్న నిజంగానే నాకు పెట్టాల్సొస్తుం దేమోనని వాళ్ళ భయం. అంతే-నేను మళ్ళా బతిమాల్లేదు సుమీ ...

"అయ్యా సుబ్రహ్మణ్యంగారూ! మీరు మరోలా అనుకోవద్దు కుర్ర దేదో అంది" అని సద్దెయ్య బోయాప రామదాసుగారు.

"బావుందయ్యోయ్! అంటే మాత్రం తప్పేముంది! మనిద్దరి కంటే అదే నయం. ఉన్నమాటంది. కానీలే. కథ విను-సరే కాఫీలయ్యాక చదరంగంమీద సరదాపడ్డాడు సుందరం. ఆటమీద కబుర్లలో మావాళ్ళ విషయం కనుక్కున్నారు. సుందరం బియ్యే దాకా చదువుకున్నాట్ట. ఏదో చిన్న వర్తకంపెట్టి బాగుపడ్డాడు. కష్టపడి పైకొచ్చాడు కాబట్టి యిప్పుడు వీలైనంత సుఖపడ్డానికి ప్రయత్నిస్తున్నాడేమో ననిపించింది నాకు. "నా" అన్నవాళ్ళు లేరు. ఏదో ఉన్నవూరుచూసి, సొంత కొంపలో నాలుగురోజు లుండి పోదామని వచ్చాడట. ఆఁ!....ఇదీ కథ. ఈ కథ చెప్పేలోగా అతని సిగరెట్టుడబ్బాలో ఇరవై సిగరెట్లు ఉఫ్‌మన్నాయి. "మొత్తంమీద ఎలాగేనా గోల్డు ఫ్లేకు బహు పరిమళమయింది. సుమండీ" అన్నాడు అవధాన్లు డబ్బాలోంచి మరొకటితీసి నోట్లోనూ మరోరెండు జేబుల్లోనూపెట్టుకుంటూ. సాయంత్రానికి చెరువుగట్టునా. రచ్చబండ దగ్గిరా, కరణంగారి అరుగు మీదా ఈ రంగథాముడి విషయమై అత్యున్నత స్థాయిలో వాగ్వివాదాలు జరిగాయి. జోగినాథం, జగన్నాథం. అవధాన్లు, కోదండంతో కూడుకున్న చతుష్టయం కూడా ఈ చర్చల్లో పాల్గొంది. తీవ్రంగా నిరసించారు సుందరం పోకిళ్ళని. ఇలా తమందరికీ యిడ్లీలూ కాఫీలూ యిప్పించడం, తమచేత

సిగరెట్లు తగలేయించడం-ప్రయోజకత్వం కాదన్నారు. బాగుపడి పైకొచ్చే లక్షణం సుతరామూ కాదన్నారు.

తమాషా ఏమిటంటే మర్నాడు పొద్దున్న నేను బెహరా హోటలు దగ్గర కెళ్ళే సరికి జోగినాధం, సుందరాన్ని-యింటి కెళ్ళి పిల్చుకొచ్చాడు స్వయంగా. అందరం చేరాం. తిరిగి యిడ్లీ వ్యవహారం-కథా కమామీషూ ప్రారంభం అయింది. సరే ఆ పైన చదరంగం. రెండాటల తరువాత డబ్బుల మీద ఆట ప్రారంభం అయింది. చతుష్టయం నలుగురూ వరసగా ఆడారు సుందరంతో, ఆటకి పావలా చొప్పున. కాఫీలకు రూపాయి, పందేలకి రూపాయి ధారపోసుకున్న సుందరం, నవ్వుతూనే యింటికెళ్ళడం చూసి చతుష్టయానికి చిర్రెత్తుకొచ్చింది.

"చూశావోయ్ వాడికి! ఎంత నిర్లక్ష్యం! ఎంత నిర్లక్ష్యం!!" అన్నాడు అవధాని.

నిర్లక్ష్యం అంటా వేమిటోయ్!పొగరను - పొగరు!"

"ఇంకా మెల్లిగా అంటా వేమిటి!"

"అయిన కాడికి డబ్బు గెల్చి వాణ్ణిలా తిట్టుకున్నారు. నాకు వళ్ళు మండింది సుమీ!

"మెల్లిగా అనకపోతే గట్టిగా అంటాడయ్యా! ఒకవేళ వింటే ఆ కుర్రాడు రేపు రాడేమో!" అన్నాను. ఛర్రుమని లేచాడు జగన్నాధం "మే మన్నదాంట్లో తప్పేముందండీ? తనసత్తా ఎదరు సత్తా తెలిసి ఆడద్దూ? డబ్బులున్నాయని ఊహ ఎగబడ్డమే!" అని.

జోగినాధం అందుకున్నాడు "చూశాను చూశాను. మూడుపావలాలు పోయాకయినా కళ్ళు తెరుస్తాడేమో! ఆట మానేస్తాడేమోనని.అబ్బే!"

"అవి పావలాలనుకున్నాడో చింతపిక్క లనుకున్నాడో" అన్నాడవధాని. ఏమనుకుంటేనేం! మర్నాడు ఇడ్లీలకీ కాఫీలకీ అంతా తయార

య్యారు. పైగా జోగినాథం బావమరదీ అవధాని మేనల్లుడూ కూడా వచ్చారు.

"అబ్బే! వాళ్ళ కెందుకండీ—చద్దివణ్ణం తిన్నారు" అన్నారు యుగళంగా. సుందరం నవ్వాడు—

"అబ్బే పిల్లలుగదండీ" అని.

"వెఱ్ఱి వెధవ—" అనుకున్నారు పెద్దలు.

మళ్ళా చదరంగం ఆడారు. సిగరెట్లు విరివిగా వెలిగాయి, జోగినాథం, దక్కనుపెట్టి పట్టీకున పెట్టేశాడు-ఎవడూ ముట్టుకోడనే ధీమాతో. సుందరం చిత్తుగా ఓడిపోయాడు నాలుగుపావలాలూ.

ఊరు గగ్గోలెత్తిపోతోంది—రోజూ అలా రెండురూపాయలు తగలవేసే రంగధాముణ్ణి గురించి. ఇంతేకాదు సుందరం గురించి, ఘోరాతిఘోరమైన పుకార్లు ప్రచారంలో కొచ్చాయి. ముష్టివాళ్ళకి అణా బేడా యిచ్చేయ్యడం, యాయవారం ఆయన్ని సుష్టుగా మేపి పైగా యింటికి పప్పులూ ఉప్పులూ ఇచ్చిపంపడం, పాలేరాళ్ళకీ బడిపంతుళ్ళకీ చొక్కాలూ పంచెలూ ఇచ్చెయ్యడంవంటివి.

"నాకు ఆవకాయ చాలా యిష్టం" అన్నాడు సుందరం ఓనాడు. జగన్నాథంగారు ముందు కురికి చవకలో మాగాయి, ఆవకాయి, మెంతికాయి, నిమ్మకాయి వారి ఆడవాళ్ళచేత పెట్టించి యిచ్చేశారు. ఈ హడావుడిలో, రాకపోకలలో, సుందరం సుబ్బలక్ష్మిని చూడ్డం, పలకరించడం జరిగిపోయింది.

గొల్లుమంది యావత్ప్రజానీకం ఈ వార్తవిని. జగన్నాథంగారి సుబ్బులు సుందరాన్ని పెళ్ళాడుతుందని వార్తలు బయలుదేరాయి. నీలాటిరేవుదగ్గరా, నూతి చప్టాలచుట్టూ, సోమయాజులుగారి చావిట్లో, బహిరంగ సభలు జరిగాయి. పడకగదుల్లో దంపతులు కష్టసుఖాల బదులు సుబ్బలక్ష్మి

సుందరీయం ప్రబంధపఠనం చేసుకునేవారు, సుబ్బలుని తమ తమ కొడుకులకి చేసుకుందామని ఆశలు పెట్టుకున్నవాళ్ళు మండిపడ్డారు. "ఈ పెళ్ళెలా జరుగుతుందో చూస్తాంగా" అన్నారు పెద్దలు.

"కులం గోత్రం సరిపోతేమాత్రం, మనవాడికన్న వాడేం పొడిచేవాడంట?" అన్నారు.

"డబ్బు స్వామీ డబ్బు! ధనమూలమిదం జగత్" అన్నారు.

"ఆఁ!ఏం డబ్బులెద్దూ! వెధవడబ్బు, డబ్బుటయ్యా శాశ్వతం, కుక్కని తంతే రాల్తుంది డబ్బు" అన్నాడు ఉమ్మాయి.

"అంతే అంతే! మాట శాశ్వతం. హరిశ్చంద్రుడి కంత పేరెందు కొచ్చిందీ? మాట—డబ్బు కూడా పట్టికెళ్ళాడా ఏం!" అన్నాడు తుమ్మాయి.

"తగ్గవోయ్! ఆ మాటకొస్తే హరిశ్చంద్రుడు పేరుమాత్రం మూటకట్టుకు పోయాడా? డబ్బు ఇక్కడే వుండిపోయింది. పేరు ఇక్కడే వుండి పోయింది" అన్నాడు రణపెంకి జగ్గాయ్.

"రాలుగాయి వెధవా! ఎంత మాటన్నావ్!" అన్నారు ఉమ్మాయీ. తుమ్మాయీ. మర్నాడు జగ్గాయి పట్నంలో పెద్దాసుపత్రికెళ్ళాడు—విన్నావా రామదాసూ;

ఇంక ఇటు చూస్తే పెంకిఘటవా, సత్యభామా, దొరసానీ,గయ్యాళి గంపా అనే నామాంతరాలు గల సుబ్బలక్ష్మి—అదేం చిత్రమోగానీ—సుందరాన్ని చూస్తే సిగ్గుపడ్డం మొదలెట్టింది; ఆ మధ్య బావున్నవాళ్ళే—ఇద్దరు ముగ్గురు హృదయాలూ అవీ సమర్పించబోతే నడికుప్పెక్కి ఆడి పోయింది. "అప్రయోజక వెధవా" అని మొదలు పెట్టి యిటు మూడు తరాలూ అటు మూడు తరాలూ ఆడిపోసింది. సుబ్బల్ని చేసొక్కడానికి ప్రద్యుమ్నుడో వాడిబాబు అర్జునుడో లేక మెత్తగా తన్ని నెగ్గుకు రాగల

ప్రయోజకుడు ఏ మారీచుడో శిశుపాలుడో దిగిరావాలి అనుకునే వారంతా. వాళ్ళమ్మానాన్నా బోల్డు బెంగపడేవారు. అంతే గాదయ్యా మరీ! పెళ్ళీడు పిల్లా! గుండెల్లో కుంపటీ అన్నారు. ఇటు దానికి చూస్తే ఉభయ గోదావరి జిల్లాల్లోని ఆంధ్ర వీర యువకుల్లో ఒక్కడూ నచ్చడాయె. ఆఁ! అదుగో అలాటి సుబ్బులు కాస్తా పట్నంనుంచి ఊడిపడ్డ సుందర్రావుని చూసి సిగ్గుపడ్డం మొదలెట్టిందంటే చిత్రంగాదూ. అతగాడిలో ఏం ప్రయోజకత్వం కనబడిందో ఆవిడకి! పైగా అక్కడితో ఆక్కుండా వాళ్ళింట్లో వంకాయ కూరో, మామిడికాయ పప్పో ఏదో వోటిచేసి రోజూ సుందరం ఇంట్లో ఇచ్చొచ్చేది.

రానురాను జనం ఈ విషయంలో రెండు పార్టీలయి పోయారు. అయితే గియితే ఈవివాహం ఆమోదించే వాళ్ళొక పార్టీ, కూడదనే వాళ్ళు రెండోపార్టీ-ఏదీ ఓచుట్టందుకో రామదాసూ—చేత్రోలు పొగాకా ఏమిటి-

చుట్టంటించి ఒక్క నిమిషం ఆగి ద్విగుణీకృతోత్సాహంతో కథ సాగించారు సుబ్రహ్మణ్యంగారు.

'చివరికి పరిస్థితులెలా పరిణమించాయంటే — ఆ పార్టీల వాళ్ళు ఒకళ్ళ నొకళ్ళు తన్నుకునేందుకు సిద్ధమయారు రహస్యంగా. గూఢచారి ఋలుకూడా బయల్దేరారు. కామాక్షమ్మ, సుబ్బులూ, సుందరం మాట్లాడుకోడం చాలామాట్లు వింది. ఆవిడని చాలా నిరుత్సాహ పరచాయవి. ఆవకాయ, జగన్నాథం నిద్రా, లేసులల్లిక, ఆనపకాయ హల్వా గురించే వాళ్ళు మాట్లాడుకునేవారు-పెదవి విరిచిందావిడ నీలాటి రేవులో.

హఠాత్తుగా పిడుగువంటి వార్త వచ్చిపడింది. దాంతో జనం నిద్రా హారాలు వర్జించారు. అందరికీ మతులు పోయాయి. దీన్ని గురించిన కబుర్ల తోటీ ఏకాహాలూ సప్తాహాలూ జరిగాయి. కొట్టుకోడానికి సిద్ధమైన

రెండుపార్టీలవాళ్ళూ ఈదెబ్బతోటి ఏకాభిప్రాయాని కోచ్చేసి స్నేహితులై పోయారు. ఎవరో కవి అన్నట్టూ. "వెయ్యేల?"- ఆ వూళ్ళోపిల్లా మేకా, తాతా అవ్వా, రాయీ రప్పా కూడా ఏకమై, జాతిమత, ధనిక దరిద్ర, స్త్రీ పురుష, సత్ అసత్ విచక్షణ ఎంతమాత్రం లేకుండా ఏకగ్రీవంగా ఒక తీర్మానం చేశారు.

"సుందరం వెర్రివెధవా, నిష్ప్రయోజకుడూ కాబట్టి చిప్పచేతి కొచ్చి తీర్తుందీ! అంచేత సుబ్బుల్ని వాడికివ్వకూడదూ" అని. రామదాసూ, ఇంతకూ అంతటి ఘోరమైన ఆ వార్త ఏమిటని అడగవేం? చెప్తావిను ఆ వార్త యిది; "సుందరం తుమ్మాయికి మున్నూవలా అప్పిచ్చాడు." నవ్వకు నవ్వకు తుమ్మాయంటే ఎవడో నీ కేం తెలుసు. వూళ్ళో వాళ్ళ నడుగు చెబుతారు.

వార్త వినగానే, "అవ్వ హవ్వ" అన్నారంతా, సుందరంమీద జాలిపడ్డారు. అతన్ని అసహ్యించుకున్నారు. వేళాకోళం చేశారు. జోగినాధం, అవధానీ, కోదండం, సుబ్బలక్ష్మి తండ్రి జగన్నాధం తాండవమాడిపోయారు. వార్త వినగానే "మా పరువు మంట కలిసిం". దన్నారు. జగన్నాధం హుటాహుటిని సుందరం యింటికెళ్ళి మండిపడ్డా డతని మీద.

"ఏమండీ అంత తప్పా ఇవ్వడం!" అన్నాడు సుందరం అమాయకంగా.

"తప్పా! తప్పన్నరా! రామ రామ! చూస్తో చూస్తో వాడికెలా యిచ్చావయ్యా? తిరిగి ఇస్తాడనే?" అన్నాడు వెనకనే వచ్చిన జోగినాధం.

"ఎంతో కష్టంలో వుండి అడిగాడు - ఎందుకివ్వడేం?"

"ఆ మాత్రం మాకు తెలీదయ్యా? ఈ వూళ్ళో ఒక్క పిట్ట - ఒక్క గింజ, వాడికి అప్పివ్వదు తెలుసా? తుమ్మాయి అప్పులెగేస్తాడనే విషయం ఈ ఊరి పాపాయిలక్కూడా తెలుసు."

"ఎవ్వరూ అప్పివ్వలేదుకదా! వాడు తిరిగి తీర్చడని మీ కెలా తెలుసు?" అంటూ అడ్డు ప్రశ్న వేశాడు సుందరం.

"తిమ్మన్న పేరు వేరే చెప్పాలా ఏమిటయ్యా! మొహం చూస్తే తెలీదూ! హవ్వ వాడు నీకు అప్పు తీరుస్తాడూ! వేశాడులే టోపీ. తిలోదకా లిచ్చుకో సద్బ్రాహ్మడిని పిలిచి."

సుందరానికి పౌరుషం రేకెత్తుకొచ్చింది.

"సరేలెండి. అందరూ ఇవ్వక పోయినా నేను యిచ్చానన్న విశ్వా సంతో నాది నా కిచ్చేస్తాడు" అన్నాడు.

"ఆఁ! ఇస్తాడిస్తాడు" అని వెక్కిరించాడు కోదండం.

"సుంద్రావు పంతులూ! వాడు నీకు తిరిగి ఆ ముప్పావలా అప్పు తీర్చేస్తే నా కుడి చెవి కోసిస్తా" అన్నాడు జోగినాథం.

"నీ కుడి చెవి నాకెందుకు" అన్నాడు సుందరం.

ఈలోగా అవధాని వెక్కిరించాడు; "ఒస్సీ! చెవి కోసిచ్చేవాడివి నువ్వేనయ్యా! చేవుంటే డబ్బు కాయి పందెం.... ఏమయ్యోయ్! సుందరం! —కబుర్లు కాదు. నువ్వు గాని వాడి దగ్గర ఆ అప్పు వసూలు చేస్తే నేను రెండు రూపాయలు పందెం ఓడిపోతా. ఇందుకు సాక్షి సుబ్రహ్మణ్యం గారే." అంటూనే రెండు రూపాయలు నా చేతిలో పెట్టాడు. సుందరం పక పక నవ్వి "సరే కానీండి" అన్నాడు.

ఈమాట జోగినాథం బెదిరించాడు. "ఓడిపోతావు సుందరం, మానుకో నీ పందెం, లేకపోతే నేనుకూడా కాస్తా" అంటూ.

"కాయండి. ధైర్యమున్న వాళ్ళంతా కాయండి. చేతనైనంత కాయండి" అన్నాడు సుందరం.

"అప్పు వసూలు చెయ్యడాని కాఖరురోజు పౌర్ణమయ్యోయ్! ఇవాళ సప్తమి. జ్ఞాపకముంచుకో." అంటూ జోగినాథం మూడు రూపాయలూ, కోదండం మూడు రూపాయలూ కాశారు.

"చూడు సుందరం! నువ్వు కుర్రాడివి. ఏదో నిన్ను వెర్రివాణ్ణి చేసి డబ్బు దోచుకోడం నాకు సుతరామూ ఇష్టంలేదు. కానీ నీకు నీతి పాఠం చెప్పడానికి నేను కూడా కాస్తున్నా. అయిదు రూపాయలు. సుబ్రహ్మణ్యంగారూ!— ఇంటి కెళ్ళి డబ్బు తెచ్చిస్తా" అన్నాడు జగన్నాథం. ఈలోగా కబురందుకున్న కరణంగారు రెండూ, మునసబుగారు మూడూ, జగ్గయ్య పావలా తెచ్చారు పందేనికి."

చుట్ట కొంచెం ఘాటుగా పీల్చి అవతల పారేశారు సుబ్రహ్మణ్యం గారు. గొంతు సరిచేసుకున్నారు.

"రామదాసూ! చేసిన పాపం చెబితే పోతుందంటారు. అణా డబ్బులకి గొల్లుమనే పల్లెటూర్లో రూపాయిలకి రూపాయిలు ఇంత మంది పందెం కాసేస్తూంటే నాకూ మనసు పుట్టింది సుమా! "నేనో రూపాయి కాశాను సుందరం" అన్నా జంకుతూ. పందాలు మొత్తం పదహారుం పావలా చేరింది నా దగ్గరికి. సుందరం వెంటనే లోపలికెళ్ళి, పదహారుం పావలా తెచ్చి, నా దగ్గర ముడుపుంచాడు— ఆనక పేచీలు రాకుండా.

ఊళ్ళో ఊసుపోని వాళ్ళందరికీ ఉషారు హెచ్చింది. తుమ్మాయి బహు జాగ్రత్తగా తిరుగుతున్నాడు సుందరానికి మొహం చాటేస్తూ. సుందరం మాత్రం నిర్విచారంగా పూలరంగడల్లే నిశ్చలంగా తిరిగేవాడు. మామూలుగానే బెహరా హోటలు, చదరంగం తతంగం సాగిపోతోంది. అంతకన్న మామూలుగా సుబ్బులొస్తూ పోతూ వుంది సుందరం ఇంటికి.

అంతా బావుందిగానీ, ఈ చివరిది ఎవరికీ నచ్చలేదు. ఏది - ఈ సుబ్బులుకి సుందరంమీద మోజు. "ఇదంతా అసలు జగన్నాథం దగ్గరుండి సాగిస్తున్నాడు." అన్నారు పెద్దలు. ఓనాటి సాయంత్రం కరణం గారి అరుగుమీద పేకాట సందర్భంలో జగన్నాథాన్ని నిలేసి అడిగేశారంతా. "ఏమయ్యోయ్, నీ కూతుర్ని ఆ పూలరంగడి కిస్తావనుకుంటున్నారు ఊళ్ళో. నిజమా ఏమిటి కొంపతీసి!" అని.

తారాజువ్వలా లేచాడు జగన్నాథం:—"ఎవడన్నాడయ్యా! అసలు అన్నదెవడూ అంట. వాడిది గుండా చెరువా! ఏమయ్యోయ్ ఒకటే లెక్క. నా కూతుర్ని పాలేరాడికిస్తే ఇంకా సుఖపడ్తుంది. చూసి చూసి ఈ మిడి మిడి రంగడికా యిచ్చేది నేను! నిష్ప్రయోజకుడు. కానీ దాచుకోడం చాతకాదూ: పైగా ఆట రాకపోయినా పెద్దాళ్ళతో చదరంగం ఆడి పందేలు కూడానూ! పోన్లేవయ్యా. అవన్నీ వదిలెయ్. ఆ తుమ్మాయిని - ఆ దగుల్బాజీ తుమ్మాయిని నమ్మి ముప్పావలా అప్పిచ్చిన వెంగళాయిని నా అల్లుడుగా చేసుకుంటానూ! చూసి చూసి! - పావలా! అర్థా! ముప్పావలా ఆయె!" అంటూ చిన్న కథాకళీ నృత్యం చేశాడు.

అంతవరకూ నిరాహారంతో పరితపిస్తున్న ఆ వూరి ప్రజలు పథ్యం పుచ్చుకోడం ప్రారంభించారు ఆరోజునుంచి - సుబ్బలక్ష్మిని సుందరానికివ్వడం కల్ల అనే ధీమాతో, ఇంక తుమ్మాయి కథకూడా తేలిపోతే నిద్ర కూడా పోవచ్చు. ఆ యొక్క వాన చినుక్కోసం నోరు తెరుచుక్కూచున్న ముత్తెపు చిప్పలాగా, గడువురోజు పౌర్ణమి కోసం జనం ఎదురు చూడసాగేరు.

"వేయికళ్ళతో కనిపెట్టి చూసేవారు తుమ్మాయి రాకపోకల్ని. సుందరం తుమ్మాయి ఇంటికెళ్ళనే వెళ్ళడు. ఓరోజు సుందరం షికారుకు బయల్దేరాడు. ఓ సందుమలుపు తిరిగేసరికి ఆ సందులోనే ఒక ఇంట్లోనుంచి బైటికొస్తున్నాడు తుమ్మాయి. సుందరాన్ని అల్లంత దూరంలో

చూడగానే పులిని చూసిన లేడల్లే ఛంగున పరిగెత్తాడు. సుందరం తరిమాడు. ఇద్దరూ కలిసి బోల్డు సందులంబడ పరిగెత్తారు. శివాలయం దగ్గర కొచ్చే సరికి సుందరం అలిసిపోయి ఇంటి దారి పట్టాడు తరమడం మానేసి.

కళ్ళు మూసుకు పరుగెత్తుతున్న తుమ్మాయి మాత్రం శివాలయం చుట్టివచ్చి అనుకోకుండా, హఠాత్తుగా ఆ సందుమొనలో సుందరాన్ని ఢీకొన్నాడు. ఇంక పరుగెత్తడానికి వీల్లేదాయె. ఆడా మొగా అరుగులమీద కెక్కిపోయి చూస్తున్నారు దొమ్మరిసాని గారడీ చూసినట్టు. జగన్నాధం గారు శివాలయం గోడమీద కూచుని గుడ్లు మిటకరిస్తున్నారు.

"ఏవండోయ్ సుందరంగారు! నమస్కారం! ఎక్కడికి బయల్దేరారు? షికారు కాబోలు—హెహ్హె......!"అన్నాడు తుమ్మాయి— అప్పుడే సుందరాన్ని చూసినట్టు.

"నమస్తే" అన్నాడు సుందరం నిశ్చలంగా.

"కులాసేనా ?" అన్నాడు తుమ్మాయి యధాలాపంగా.

"ఆ ! కులాసాయే. మీరు కులాసాయేనా ?"

ఏడుపుమొహం పెట్టాడు తుమ్మాయి. "ఏవిటోనండి ఏం కులాసో! వంట్లోచూస్తే బాగులేదు. కీళ్ళవాతం !అడుగుతీసి అడుగెయ్యలేకపోతున్నా! ఇంటో చూస్తే ఆవిడకి జ్వరం. పిల్లలకి కురుపులు. బియ్యపు గింజలేదు. అయ్యా ! ఏం చెప్పమన్నారూ ! ఇంక అటు చూస్తే మామిడితోట అపుడే పండు ముఖం పట్టింది. దొంగ భయం. పక్షి భయం. అయ్యా ! ఆ పండు మిగల ముగ్గీలోగా దింపాలి—అమ్మాలి. ఇంట్లో పొయ్యిమీద కుండ ఎక్కాలి."

"అయ్యో పాపం !" అన్నాడు సుందరం.

"ఎంత మాటెంతమాట ! హిహిహ్హి — సుందరం బాబూ.

వయసుకి చిన్నయినా ఘనమైన మనసు బాబూ నీది. ఎంత దయ! ఎంత దయా! అచ్చం ముమ్మూర్తులా మీ తండ్రి క్రిష్ణమూర్తిగారిని పోలావు. చచ్చి స్వర్గాన్నున్నాడు మహరాజు, ఏవిటో!....ఆ(! అన్నట్లు చూడుబాబూ నీకు గుర్తుందో లేదోగాని నాకుంది సుమీ. అహర్నిశలూ నిద్రపోను. నేనూ మా ఆవిడా వూహూ ఒకటే ఇదై పోతూవుంటాం మీ ఇది తల్చుకుని. ఆ(! చూడుబాబూ! తెలుసునా సంగతి? మరేం లేదు: కూలీల్ని మాట్లాడాను, ఒక్క మూడురూపాయలప్పిస్తివా—అది వాళ్ళ ఎదాన్న పారేసి పండు దింపించేసేస్తే పట్నం పంపిస్తా అమ్మకానికి. చేతికొచ్చిన కూడు చెడిపోతూంటే మనసొప్పుతుందా బాబూ మరీ? మరోకటి పట్నం నుంచి డబ్బొచ్చేదాకా నువ్వాగక్కర్లేదు. బాగా పండబారినపళ్ళు ఒక వంద ఏరి, ఈ ఊళ్లోనే నీ కళ్ళెదురుగుండా అమ్మిపారేస్తా. నీ డబ్బు నీకు పువ్వుల్లో ముడిచి యిచ్చేస్తా. బాబ్బాబు ఈ సారి కాదుకో! నా తండ్రి నా తండ్రి" అంటూ ప్రాధేయపడ్డాడు తుమ్మాయి.

ఒక్కక్షణం ఆలోచించాడు సుందరం. ఇటు చూస్తే దీనావస్థలో ఉన్న తుమ్మాయి. అటు చూస్తే తనవంక ఆత్రుతగా— తన జవాబుకోసం ఎదురు చూస్తున్న అశేష ప్రజానీకం. . బుద్ధుడు గుర్తుకొచ్చాడు. హామ్లెట్ కనపడ్డాడు.... అటా ఇటా? ఇటా అటా....

"గబుక్కున జేబులో చెయ్యి పెట్టి మూడు రూపాయలూ తీసి తుమ్మాయి చేతిలో పెట్టేశాడు. చూస్తున్న జనానికి "హా"అనడానికి కూడా ఓపిక లేకపోయింది.

తుమ్మాయి అందరికన్నా ఎక్కువ ఆశ్చర్యపోయాడు. తక్షణం స్తుతివాక్యాలు ప్రారంభించాడు. "సరే మీరు ఇంక వెళ్ళండి. పళ్ళు దింపగానే నాకు డబ్బు మాత్రం ఇచ్చెయ్యండి" అంటూ చక్కా పోయాడు సుందరం. ఆ రోజు ఆ వూరి చరిత్రలో చెప్పుకోదగిన రోజు. జనం

విరగబడి నవ్వారు, విమర్శించారు. వెయ్యిందాల తిట్టుకున్నారు....ఏదో సంమెత చెబుతారు చూడూ—ముప్పావలా కోడిపిల్లకి దిష్టి తగిలిందని మూడున్నర ధరచేసే పంది పిల్లని దిగదుడిచారట ఎవడో. సుందరాన్ని శుద్ధ వెఱ్ఱివెంగళాయగా జమ కట్టేశారు జనం. ఇది జరిగింది నవమినాడు.

దశమి ఉదయాన చదరంగం బల్ల దగ్గిర తమాషా జరిగింది. అంతవరకూ రోజూ ఓడిపోతున్న సుందరం ఆవేళ జగన్నాథం దగ్గిర పావలా గెలిచాడు. మళ్ళీ ఆడి ఇంకో పావలా ఓడిపోయాడు జగన్నాథం. తరవాత మిగతా ముగ్గురూ తలో మూడేసి ఆటలూ ఆడి మూడేసి పావలాలు ఓడిపోయారు. సుందరం చదరంగంలో తమని గెలవడం ఏమిటని బోలెడు కోప్పడి పోయారు వాళ్ళు. పట్టుదలకి మధ్యాహ్నం వేశారు ఆట.

సాయంత్రం చీకటిపడేసరికి నాలుగు రూపాయలు గెలుచుకున్నాడు సుందరం.

జగన్నాథాది చతుష్టయం ధోరణి మారింది. వాళ్ళ చిరునవ్వు హరించిపోయింది. ఊళ్ళోకూడా సద్దుమణిగింది. జనం చిరాగ్గా ఉన్నారు:

ఏకాదశినాటి ఉదయం మధ్యాహ్నం కూడా ఒక్క ఆట పోకుండా నలుగురినీ గెలిచాడు సుందరం. సుందరంఆవాళసంపాయించిందిఏడున్నర.

జోగినాథానికి వేడెక్కింది; అవధానికి ఏడుపొచ్చింది. జగన్నాథం జోరుతగ్గింది. కోదండం కంగారుపడ్డాడు.

ద్విగుణీకృతమైన పట్టుదలతో ద్వాదశినాడు కూర్చున్నారు ఆటకి. ఊరి పెద్దలంతా ప్రేక్షకులుగా వచ్చారు. తాగిన కోతులల్లే తందనాలాడి పోతున్న చతుష్టయాన్ని టకటకలాడించి పారేశాడు సుందరం. ఇట్టే

ఆట కట్టేవాడు, సాయంత్రానికి మరో ఎనిమిది రూపాయలు ఒడేసి పుచ్చుకున్నాడు.

జనానికి ఏం చెయ్యాలో తోచలేదు. చూసి చూసి చప్పట్లు కొట్ట డానికి మనసు రాలే దెవ్వరికీ.

"అసలీ సుందరం ఎవడు?"

"ఇంత ఆట ఎక్కడిదయ్యా వీడికి!"

గత ఎనిమిది రోజులుగా, ఆట పేరుచెప్పి రూపాయీ. కాఫీ సిగరెట్లకి ఇంకో రూపాయీ—మొత్తం రోజుకి రెండు రూపాయల చొప్పున, ఎనిమిది రెళ్ళు పదహారు రూపాయిలు వాడికి నష్టం అయిందనుకో. అయితే మొన్న,నిన్న, ఇవాళ కలిసి వాడు మన దగ్గిర గెలిచిన మొత్తం పందొమ్మిదిన్నరా. వీడిదుంప దెగా! నిముషాలమీద ఆటకట్టి పారేస్తుం టేనే! మతిపోగొట్టేస్తున్నాడాయె!

"ఉద్దండుడిలాగే ఉన్నాడే చూస్తే!" అన్నాడు జోగినాధం.

"ఎలాగేనా గడుసు బుఱ్ఱే సుమా?...." అంటూ సాగదీసుకున్నాడు కోదండం.

"నాకు మతిపోయింది" అని బాహాటంగా ప్రకటించాడు అవధాని.

అదేముక్క అందరూ విడివిడిగా అనుకున్నారు.

త్రయోదశి తెల్లవారింది. కాలవకి నీళ్ళకెళ్ళిన వంటవాడు, తుమ్మాయి మామిడిపళ్ళు బళ్ళకెత్తించి పట్టం పంపించబోతున్నాడని చెప్పాడు— పరుగునవచ్చి సుందరంతో.

పొద్దున్నే పనికట్టుకుని పదిమందినీ పిలిచి వచ్చింది సుబ్బలక్ష్మి తల్లి—"మా యింటికి పసుపుకుంకానికి రండి" అని.

నాకు అంతుచిక్కలేదు. ఆశ్చర్యంవేసి — జగన్నాధంకోసం బయలుదేరాను. అతగాడు, పొలంనించి ఇంటి కొస్తున్నాడు. ఇద్దరం కలిసి కాలవవడ్డుకి వచ్చేసరికి తుమ్మాయి మామిడిపండ్లబండి పట్టం బయలు దేరుతోంది. పెద్దకొడుకుని బండితోకూడా పంపుతున్నాడు.

మేం నవ్వుకున్నాం తుమ్మాయ్ తెలివికి.

ఇంతలో హటాహుటిని సుందరం వచ్చేశాడు—సిగరెట్టు కాలుస్తూ. తుమ్మాయి కంగారుపడ్డాడు. మేం దగ్గిరికి వెళ్ళాం.

“దింపవయ్యా! పళ్ళుదింపు. వందపళ్ళు ఇక్కడే అమ్మి నా డబ్బు నాకిస్తానన్నావుగా” అన్నాడు సుందరం. తుమ్మాయి నసిగాడు.

“తొందరపడకు సుందరంబాబూ! బహు కుటుంబీకుడిని. కొంచెం జాలి చూపించు. పళ్ళు పట్నంలో అమ్ముకుంటే నాలుగు డబ్బులు ఎక్కువ ముడతాయి. ఈ పల్లెలో ఏం గిడుతుంది చెప్పు, చవకని అమ్ముకుంటే? నామాట వినుబాబూ. ఒక్కరవ్వ ఆగు. సాయంత్రానికి నీ డబ్బు పువ్వుల్లోపెట్టి నీకిస్తా.

“తుమ్మాయిగారూ ఇంక మనం ఇందుగురించి వాదించుకో వద్దు .... మొదట అనుకున్న ప్రకారం వందపళ్ళూ దింపండి; ఆనకే బండి వదుల్తాను.” అన్నాడు సుందరం.

తుమ్మాయి మళ్ళీ ప్రయత్నించాడు; కాని ఆటసాగలేదు. గోవిందా! అంటూ వందపళ్ళు-బాగా మగ్గినవి-తీసి ఓ గంపకెత్తి కూలాడి నెత్తిన పెట్టించాడు.

“పద నేనూ కూడా వుంటా. అమ్మించు”అన్నాడు సుందరం.

“చాలా చిత్రంగా వుందే కుఱ్ఱాడి వ్యవహారం! మొత్తంమీద వ్యవహార దక్షుడల్లేనే ఉన్నాడే”....అన్నాడు జగన్నాధం కొంచెం ఆశ్చర్యంతో.

ఊళ్ళో ప్రవేశించాం మెల్లిగా.

"మామిడి పళ్లు మామిడిపళ్ళు, రసాలు.... అరముగ్గినవండి ఆరగించండి" అంటూ కేక వేశాడు కూలివాడు. వాడి వెనక తుమ్మాయి, సుందరం, ఆ వెనక నేనూ జగన్నాధం నడుస్తున్నాం. ఊరు నడిబొడ్డుకి వెళ్ళేవఋకు ఓ చిన్న గుంపు తయారయింది— మా కూడా.

పళ్లు కొనటానికి ఎవడూ ముందుకు రావటంలేదు. అందరూ వింత చూస్తున్నారు ఆత్రుతగా. జగన్నాధంగా రిల్లు సమీపించే సరికి "ఏయ్, మామిడిపళ్ళూ!" అంటూ గావుకేక పెట్టింది సుబ్బలక్ష్మి గుమ్మంలో నుంచుని.

"బావుంటుందా సుబ్బలక్ష్మి?" అంది కథ వింటున్న పద్మ, సుబ్రహ్మణ్యంగారివేపు కళ్లు సన్నంగా చేసి చూస్తూ

"అడగాల్సినచోట అడగాల్సినప్రశ్న వేశావుతల్లీ!" అంటూ విరగబడి నవ్వారు సుబ్రహ్మణ్యంగారు. "సన్నగా పొడుగ్గా ఉంటుంది సుబ్బలక్ష్మి. గుండ్రని మొహం. కొట్టొచ్చే ముక్కుకి ఎడా పెడా పకా పకా నవ్వే పెద్దకళ్లు. కళ్ళనిండానూ, చుట్టూనూ, అలుక్కుపోయిన కాటుక. ఆ పైన దీపమంటి బొట్టు, సన్నని చక్కని పెదిమలు, సైజువారీగా గుచ్చిన ముత్యాల సరమల్లే పొందికగా అమరి తళతళలాడే పలువరుస ... ఆఁ.... నవ్వినప్పుడేం, - నవ్వినప్పుడూ ఆ యొక్క గులాబీరంగు లేత చిగుళ్ళు వాటికింద ధవళ దంతాలూ, చిదిపితే పాలుగారే చెంపలమీద, కనీ కనపడనట్లు రెండు సొట్టలూ, వంపుతిరిగిన సన్నని పెదిమలూ, ఈ మొదలైన యావత్తూ సరంజామా వాటివాటి పనులను అరక్షణం చేసేస్తాయి. ఆడది విస్తుపోతుంది ఆ నవ్వుచూసి, మొగాడు పిచ్చెత్తిపోతాడు. అన్నట్టు మర్చిపోయాను. ఆవేళ తలంటిపోసుకుంది. ఆ పిల్లతాలూకు ఉంగరాల జుట్టు మహా పొగరుగా అల్లరి చేసేస్తోంది గాలిలో ఎగురుతూ. పొడుగ్గా ఆ జుత్తు పిరుదులవరకూ దిగిపోయింది, అయిందా....ఇంక కంఠం దగ్గిర కొద్దాం ....కంఠం ఎలా ఉందంటే...."

రామదాసుగారు కొంచెం గట్టిగా గొంతు సవరించుకున్నారు. పొడి దగ్గుతో. "హి హి హి ....పంతులుగారు కవిత్వంలో పడిపోతున్నారు. కథ చెబుదురూ.... హి హి హి" అన్నారు.

రామదాసుగారి మనసులో అసలు సంగతి గ్రహించారు సుబ్రహ్మణ్యంగారు. కొంటెగా నవ్వి కథ ప్రారంభించారు;

"ఆఁ. ఏం చెబుతున్నాను?....అదేఅదే....ఆ జగన్నాధం కూతురు సుబ్బలక్ష్మి గుమ్మంలో నుంచుని మామిడిపళ్లు కేకేసింది.

కొయ్యబారి పోయారు జగన్నాధం గారితోపాటు యావన్మందిన్నీ. తుమ్మాయి నివ్వెరబోయాడు. నోట మాట రాలేదు ఎవరికీ ఈ అనుకోని సంఘటనవల్ల.

"ఎలాగ వంద?" అంది సుబ్బలక్ష్మి ధైర్యంగా.

"నాలుగు రూపాయల పావలా అండి. ఒకటే ధర." అన్నాడు సుందరం అందుకుని. సుబ్బలక్ష్మి సిగ్గుతో తలవంచింది. లోపలికి వెళ్ళింది "అమ్మా! నాలుగుంబావలాయేనటే" అంటూ.

అందరం ఊపిరి బిగబట్టి చూస్తున్నాం. సుబ్బలక్ష్మి బయటికి వచ్చింది. అందర్నీ ఓమాటు కలియచూసింది. నిర్లక్ష్యంగా తల తాటిస్తూ "ఏయ్ అబ్బీ! గంపలో ఉన్నవి వందేనా?.... అయితే తెచ్చి లోపల పొయ్" అంది. క్షణాలమీద జరిగిపోయింది అంతా.

మెస్మరైజు అయినవాడివలె జగన్నాధంగారు స్వంతఇంటి గుమ్మం ఎక్కారు. ఈలోగా తుమ్మాయి డబ్బుకోసం చెయ్యి చాచాడు. కాని సుందరం ముందుకు దూకి, తన చెయ్యే ముందుకి జాచాడు. సుబ్బలక్ష్మి మూడు విచ్చురూపాయలూ, అయిదు పావలాలూ సుందరం చేతిలో పోసింది సిగ్గుపడుతూ.

"తుమ్మాయిగారూ! మీరు నాకు బాకీవున్న మూడుమ్ముప్పావలా ఇదిగో, తీసుకుంటున్నాను. ఇదిగో ఓ పావలా వీడికి కూలీ ఇస్తున్నాను, మిగతా పావలా ఇదిగో మీది" అన్నాడు సుందరం.

కోపంతో, ఏడుపుతో తుమ్మాయి ఆపాదమస్తకం కంపించి పోయాడు. "క్రూరుడివి సుందరం! ద్రోహివి సుందరం!...." అంటూ బోలెడు తిట్టుకుంటూ పెద్ద పెద్ద అంగలువేస్తూ వెళ్ళిపోయాడు- సుందరం చేతిలోంచి లాక్కున్న పావలాని, నేలవేసికొట్టినంత విసురుగా జేబులో వేసుకుంటూ.

గుప్పిటలో డబ్బుని గుంపుకి చూపాడు సుందరం. "ఇదిగో తుమ్మాయి తీర్చిన అప్పు. దీనిమీద మీరందరూ పందెం కాసిన పదహారుంబావలా ఇలా ఇవ్వండి సుబ్రహ్మణ్యంగారూ" అన్నాడు సుందరం.

హాహాకారాలు చెలరేగాయి. గాలి దుమ్ములా లేచాడు జగన్నాధం కూతురిమీద: నువ్వూ-నువ్వూ....నీకు...నీకేమన్నా.... ఈ పళ్ళు ఎందు క్కొన్నావు? ఆ?...."అంటూ నాలిక బయటపెట్టి గుప్పిట్లు బిగించాడు.... తలుపు చాటునుంచి ఆయన భార్య అందుకుంది. చాల్లేండి భాగోతం.... దాని మీదికలా ఒంటికాలిమీద లేచిపోతారెందుకు?....కొనమన్నదాన్ని నేనూ. ఇవాళ సుందరానికి మన సుబ్బుల్నిచ్చి పెళ్ళి చెయ్యడానికి ప్రధానం జరుపుదాం అనుకుంటుంటే .... అందుకని మామిడి పళ్ళు కొనమన్నాను. మీరు రాగానే చెబుదాం అనుకుంటున్నాను" అంది సన్నగా.

పేరిశాస్త్రిగారు సులోచనాలు తగిలించుకుని పంచాంగం విప్పాడు. "దివ్యమైనముహూర్తం బాబూ! ఇవాళ. తమరిదే ఆలస్యం. సదస్యులు వచ్చారు" అన్నాడు.

జువ్వలా లేచాడు జగన్నాధం. "నిష్ప్రయోజకుడు. కానీ దాచుకో లేనివాడు...."

"చాల్లే నాన్నా మీకన్నా నయమే" అంది సుబ్బులు.

చాలా చిత్రంగాలేదూ?....సరే నేను ముందుకొచ్చి తగులు కొన్నాను. ఎవడయ్యా నిష్ప్రయోజకుడు? అతనా మనవా?....హుఁ.... తెలివంటే అతగాడిది. లౌక్యం అంటే అది....మీకు కాఫీలు, ఇడ్లీలుపెట్టి కబుర్లు చెబుతూనే చదరంగం ఆటలో మీ లోపాలు కనిపెట్టేసి, కిటుకులు నేర్చేసుకుని-మీకు ఇంతవరకూ ఖర్చు పెట్టిందీ, మీ దగ్గిర ఓడిపోయిందీ కలిపిన దానికన్నా నాలుగురాళ్ళు ఎక్కువే ఒడేసి లాగాడు మీ దగ్గిర.... పైగా తుమ్మాయిలాటి ఉద్దండుడి దగ్గర్నించి నవ్వంగా అప్పు వసూలుచేసి దానిమీద పందేల రూపేణా పదహారు రూపాయలు గెల్చాడు. నీ కూతురికి ఇంతకన్న గొప్పవాడిని ఎక్కడ తెస్తావయ్యా? డబ్బుంది, తెలివి ఉంది, మంచి మనస్సు ఉంది ....లౌక్యం తెలుసూ...."

"అన్నిటికన్నా ముఖ్యం అయినది వాళ్ళిద్దరికీ ఇష్టం అయింది" అంది సుబ్బలక్ష్మి తల్లి తలుపుచాటునుంచి. సుందరం ముసి ముసి నవ్వులతో జగన్నాథానికీ, నాకూ, కరణంగారికీ నమస్కరించాడు.

సుబ్బులు జడ ఎగరేసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

"అబ్బో! ఎంత లౌక్యం చూపావయ్యా! ఇక్కడ కూడా" అనుకుంటూ. నేను ఫక్కున నవ్వాను.

కథ ముగించారు సుబ్రహ్మణ్యంగారు. కథ విని కిలకిల నవ్వింది పద్మ.

"నీకూ వస్తున్నాడులే, అలాటి మొగుడే-ఇంకో గంటలో....ఆ మాటకొస్తే ఇతగాడు సుందరాన్ని మించిన సుగ్రీవుడు" అన్నారు సుబ్రహ్మణ్యంగారు. రామదాసుగారు సాభిప్రాయంగా చూశారు సుబ్రహ్మణ్యంగారి వంక.

"సుగ్రీవుడ ందంగా ఉంటాడా?" అంది పద్మ.